క్లుప్తంగా

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం చైత్ర మాసం పునర్వసు నక్షత్రం అష్టమి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: శ్రీరామ నవమి సందర్భంగా అద్దంకి నియోజకవర్గ ప్రజలకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరికీ సీతారాముల అనుగ్రహం లభించాలని ఆకాంక్షించారు.

ఒన్‌టౌన్ సీఐగా సూరేపల్లి సుబ్బారావు



సూరేపల్లి సుబ్బారావు

చీరాల: చీరాల ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా సూరేపల్లి సుబ్బారావు శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలులో ఎస్సీ, ఎస్టీ సెల్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై చీరాల ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సైలు, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చీరాల డీటీ అర్జున్ బదిలీ

చీరాల టౌన్: మండల ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ (రీ సర్వే డీటీ) దేవతోటి అర్జున్ చీరాల నుంచి జె. పంగులూరుకు శుక్రవారం బదిలీ అయ్యారు. చీరాల ఆర్డీఓ ఆదేశాల మేరకు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లను వారికి కేటాయించిన మండలంలోనే విధులు నిర్వహించాలని ఆదేశాలివ్వడంతో చీరాల నుంచి డీటీగా అర్జున్ రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో ఆర్డీవో కార్యాలయంలో రీసర్వే డీటీగా పనిచేస్తున్న ప్రసన్నను చీరాల రీ సర్వే డీటీగా నియమించారు. బదిలీ అయిన రీసర్వే డీటీలు విధుల్లో చేరారని తహసీల్దార్ కె.గోపీకృష్ణ శనివారం తెలిపారు.

బంగారుబాబుకు ఘన సన్మానం

అద్దంకి రూరల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన అద్దంకికి చెందిన కొండముది బంగారుబాబును అద్దంకి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం బ్రహ్మంగారి దేవస్థానంలో సన్మానించారు. జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

పశువుల నీటితొట్టి నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న మాజీ సర్పంచ్ వీరభద్రయ్య

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ పరిధిలోని ఆణుమల్లిపేట శివారులో పశువుల నీటి తొట్టి నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. మాజీ సర్పంచ్ నాశిక వీరభద్రయ్య మాట్లాడుతూ వేసవి కాలంలో పశువులు నీరు తాగడానికి అనువుగా ఎన్‌ఆర్‌జీఈఎస్ పథకం ద్వారా నిధులు మంజూచేయించినట్లు తెలిపారు. ఆణుమల్లిపేటలో పశువులపై ఆధారపడి అనేక మంది రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని వివరించారు. గుత్తి వీరప్రసాదరావు, మద్దసాని చెంచులు, వెంకటేశ్వర్లు, బుద్ధి దుర్గ మల్లేశ్వరి పాల్గొన్నారు.

మండప నిర్మాణానికి రూ.1 లక్ష విరాళం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన రాతి ముఖమండప నిర్మాణానికి భారీ విరాళం లభించింది. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం, భీమవరం గ్రామానికి చెందిన నలబోతు వెంకట మోహన్‌రావు, ఉమాదేవి దంపతులు శనివారం రూ. 101,116 దేవస్థాన ఏసీ యం. తిమ్మనాయుడుకు అందజేశారు.


విరాళాన్ని అందజేస్తున్న దాతలు

బతుకు విన్యాసం

- చీరాల్లో ప్రమాదకర ప్రయాణాలు నిత్యకృత్యం
- పట్టించుకోని పోలీసులు


ఆటోలో పక్కన, వెనుక నుంచొని 25 మంది కూలీలతో ప్రమాదకర ప్రయాణం చేస్తున్న ఆటో

ట్రాన్స్‌పోర్టు వాహనంలో కిక్కిరిసి ప్రయాణం చేస్తున్న వ్యవసాయ కూలీలు

చీరాల టౌన్:

వ్యవసాయ కూలీలు బతుకు పోరాటంలో ప్రాణాలు ఫణంగా పెడుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఇతర నియోజకవర్గాల్లోని గ్రామాలకు పనుల కోసం వెళ్తున్నారు. బతుకు జీవన పోరాట కోసం ప్రమాదమని తెలిసినా కానీ పరిమితికి మించి ఆటోల్లో ప్రమాదకర ప్రయాణాలు చేస్తున్నారు. ఒక్కో ఆటోలో 25 మంది వరకు ఎక్కించుకోవడంతో పాటు పక్కన నుంచోవడం, వెనుక నుంచుని మరీ ప్రయాణాలు చేస్తున్నారు. చీరాల మండలంలోని బోయినవారిపాలెం, పిట్టువారిపాలెం, గవినివారిపాలెం, బుర్లవారిపాలెం నుంచి ప్రతిరోజూ ట్రాన్స్‌పోర్టు వాహనాలు, ఆటోల్లో పరిమితికి మించి వ్యవసాయ కూలీలు అటు ఒంగోలు.. ఇటు పర్చూరు.. చిలకలూరిపేట ప్రాంతాల్లో వ్యవసాయ కూలీ పనులకు వెళ్తున్నారు. ప్రతీరోజూ ఉదయం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు గ్రామాల నుంచి వచ్చే కూలీలు ఆటోలతో చీరాల–బాపట్ల ప్రధాన రహదారి ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, రవాణాశాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నాలుగురోజుల క్రితం చినగంజాం టోల్‌గేట్‌కు దగ్గరలో జరిగిన వ్యవసాయ కూలీల ఆటో ప్రమాదంలో ఏడుగురు కూలీలు తీవ్రంగా గాయపడినా.. ఎలాంటి మార్పు రావడం లేదు.


పుట్టంరాజు దంపతులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

పుట్టంరాజుకు ఘన సన్మానం

అద్దంకి: ఇటీవల రాష్ట్రం ప్రభుత్వం అందజేసిన ఉగాది పురస్కారం అందుకున్న పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తిని సాహితీ కౌముది, రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని చిన్ని శాంతయ పిచ్చమ్మ గార్లసేవా సదన్‌లో నిర్వహించారు. ఈ సభకు సాహితీ కౌముది గౌరవాధ్యక్షుడు వారణాశి రఘురామశర్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు మాట్లాడుతూ ఈ పురస్కారం పుట్టంరాజు తెలుగు భాషకు చేసిన సేవలకు దక్కిందని చెప్పారు. ఏపీ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు రావుల బాపయ్య చౌదరి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం ఏర్పాటులో పుట్టంరాజు పాత్ర శ్లాఘనీయమన్నారు. తరువాత దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో చుండూరి మురళీ సుధాకరరావు, గేదేపల్లి దివాకరదత్తు, నారాయణ బలసుబ్రహ్మణ్యం, గోరంట్ల బ్రహ్మనాయుడు, డాక్టర్ యు. దేవపాలన, సందిరెడ్డి వెంకటేశ్వర్లు, నిమ్మరాజు నాగేశ్వరరావు, మలాది శ్రీనివాసరావు, రోటరీ క్లబ్‌సభ్యులు ఇతర పెద్దలు పాల్గొన్నారు.

నేడు ఆధ్యాత్మిక ప్రవచనం

చీరాల రూరల్: స్థానిక పాపరాజుతోట స్వర్ణరోడ్డులోని లయన్స్‌క్లబ్ సర్వీస్‌ట్రస్ట్ బిల్డింగ్‌లో ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక పీఠం చీరాల అధ్యక్షుడు వి. వెంకట్రావు శనివారం తెలిపారు. ముందుగా బాల బతకమ్మ అష్టలక్ష్మి సమాజం వారిచే సంకీర్తన ఉంటుందని తెలిపారు. ప్రవచన ఉపన్యాసకులుగా రాష్ట్రీయ విద్యా గౌరవ బంగారు పతక అవార్డు గ్రహీత నందనవనం శ్రీనివాసరావు వ్యవహరించనున్నారని తెలిపారు.

జరీ నాగేశ్వరరావు, అన్నపూర్ణమ్మ చారిటీస్ వారు ప్రసాద ఉభయదాతలుగా వ్యవహరించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్‌రాం


మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


వేటపాలెంలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది


చీరాల: జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కరణం వెంకటేష్


చీరాల : జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ


అద్దంకిలో ఎంఆర్‌పీఎస్ నేతల నివాళి..

- భారత మాజీ ఉపప్రధానికి ఘన నివాళి

చీరాల టౌన్: విద్యావేత్తగా, మచ్చలేని వ్యక్తిగా.. భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రాం చేసిన సేవలు చారిత్రాత్మకమని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. బాబూ జగ్జీవన్‌రాం 118వ జయంతి సందర్భంగా శనివారం తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రాం దేశ ప్రజల కొరకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. భారత ఉప ప్రధానిగా, తొమ్మిది సార్లు ఎంపీగా పనిచేసి దేశంలోనే రాజకీయ మేధావిగా గుర్తింపు పొందారని తెలిపారు. అట్టడుగు వర్గం నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన జగ్జీవన్‌రాం స్ఫూర్తితో యువత ముందుకు నడవాలని సూచించారు. రాజకీయ మేధావిగా గుర్తింపు పొంది ఎన్నో శాఖలకు మంత్రిగా పనిచేసి మంచి పేరు ప్రఖ్యాతలు గడించారన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు సత్యం, శేఖర్, వీఆర్వోలు కృష్ణారెడ్డి, కళ్యాణ్, జయబాబు, సిబ్బంది ఉన్నారు.

వేటపాలెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రాం జయంతి వేడుకల సందర్భంగా తహసీల్దార్ పార్వతి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): మాజీ ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. అందరికీ స్వీట్లు పంచి పెట్టారు. మక్కెన శేఖర్, లక్కిపోగు సుమన్, ఎన్. కిషోర్, వి. అబ్రహం, ఎస్. సుబ్బారావు, కొండ్రగంటి శివ తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో..

మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్‌రాం జయంతిని శనివారం మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యద్దనపూడి: జగజ్జీవన్‌రాం చేసిన సేవలు చారిత్రాత్మకమని ఎంపీడీఓ పీటీవీ కృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాబూ జగజ్జీవన్‌రాం 118 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అట్టడుగు వర్గం నుంచి వచ్చిన 9సార్లు ఎంపీగా, ఎన్నోశాఖలకు మంత్రిగా పనిచేసి మంచిపేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నారన్నారు. దళిత ప్రజల అభ్యున్నతి కోసం ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు: బాబూ జగజ్జీవన్‌రాం జయంతి వేడుకలను శనివారం మండలంలోని చిమ్మిరిబండలో ఘనంగా నిర్వహించారు. గ్రామం సెంటర్‌లోని జగజ్జీవన్‌రాం, అంబేడ్కర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, భారత దేశ ఉప ప్రధానిగా బాబూ జగజ్జీవన్‌రాం దేశానికి చేసిన సేవలను నాయకులు కొనియాడారు.

కేశవరప్పాడు(కారంచేడు): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్త బాబూ జగజ్జీవన్‌రాం భారత జాతిరత్నంగా పేరొందారని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ సెల్ నాయకులు చిరుమల సుధాకర్ మాదిగ అన్నారు. శనివారం కేశవరప్పాడులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నివాళులర్పించారు. మండలంలోని ఆదిపూడి ఎస్సీ కాలనీలో నివాళులర్పించారు. బండారు వెంకటేశ్వర్లు, పారి సుధాకర్, ధనరాజుపల్లి నాగరాజు, పారి అబ్రహాం, వలేరు కల్యాణ్‌బాబు, పారి కుమార్, పారి యేబు, పి. జీవన్‌బాబు పాల్గొన్నారు.

బల్లికురవ: పేద, బడుగు బలహీన వర్గాలను ఉన్నత స్థానంలో నిలిపిన మహోన్నత వ్యక్తి భారత మాజీ ఉపప్రధాని బాబూ జగజ్జీవన్‌రాం అని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు పత్తిపాటి నాగయ్య మాదిగ అన్నారు. శనివారం నక్కబొక్కలపాడు ఎస్సీ కాలనీ వద్ద గల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల శాఖ అధ్యక్షుడు బండి బాబూరావు, బండారు పార్థసారథి, సురభి ప్రభాకరరావు, రామారావు, బండి రవి, వెంకటేష్ జంధ్రాజుపల్లి, జగజ్జీవన్‌రావు,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి, అడకా గంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, భారతదేశ ఉప ప్రధానిగా దేశానికి చేసిన సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గర్నెపూడి రవి చందు, మైల చిన్న నాగేశ్వరరావు, తమ్ములూరి సురేష్, నూకతోటి శామ్యూల్, వెంకయ్య, చిన్ననాయక్, కృష్ణారావు, జైపాల్, బుడే, లింగారావ్, ప్రేమ రాజు, ఆశీర్వాదం తదితర నాయకులు పాల్గొన్నారు. మండలంలోని చిమ్మిరిబండ గ్రామంలోని సెంటర్లో గల బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చీరాల: ఆదర్శనీయుడు బాబూ జగ్జీవన్‌రాం అని, దళిత, పీడిత వర్గాల కోసం అనేక పోరాటాలు చేసిన మహనీయుడని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. శనివారం బాబూ జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని ముక్కోణం పార్కు సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చరిత్రలో ఎవరూ చేయని విధంగా ఏకధాటిగా 40 సంవత్సరాలు మంత్రిగా, ఉపరాష్ట్రపతిగా పనిచేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచిస్తే ఆ రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ఆయన ముందుండేవారన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం ఆయన ఎన్నో పోరాటాలు చేశారన్నారు. వైస్ చైర్మన్ శిఖాకొల్లి రామసుబ్బులు, కౌన్సిలర్లు గోలి జగదీష్, కంపా అరుణ్, గొట్టిపాటి ఎబినేజర్, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, గుంటూరు ప్రభాకరరావు, చీమకుర్తి బాలకృష్ణ, తోకల అనిల్, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ కబీర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ళ వాసు, పార్టీ నాయకులు కోడూరి ప్రసాదరెడ్డి, మాజీ కౌన్సిలర్ శిఖా సురేష్, శీలం వెంకటేశ్వరమ్మ, తేళ్ళ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ముక్కోణం పార్కు సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శిగరకొండ ఆధ్వర్యంలో స్థానిక కట్టకిందపాలెంలోని విగ్రహానికి నివాళి అర్పించారు. చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నాగిపోగు చక్రవర్తి, పూనూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరులోని శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఇంకొల్లు (చినగంజం): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బండారు అనూష ఆధ్వర్యంలో బాబూ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు, బండారు ప్రభాకర్ రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఇంకొల్లు: చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ


యద్దనపూడిలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది


చిమ్మిరి బండలో నివాళులర్పిస్తున్న నాయకులు

భారత రాజ్యాంగాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి


భారత రాజ్యాంగంపై ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

చీరాల రూరల్: అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగంపై భారత పౌరులై ఉన్న ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నవ్యాంధ్ర భారతరాజ్యంగ పీఠిక ప్రచార కమిటీ, ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు. అంబేడ్కర్ 134 జయంతిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం స్థానిక ఘంటసాల విగ్రహం వద్ద భారత రాజ్యాంగ పీఠిక లక్ష్యాలపై విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజ్యాంగ పీఠికలోని 10 అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సర్వసత్తాక, గణతంత్రం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ప్రాథమిక హక్కులు, విధులు అలానే ఆదేశిక సూత్రాలైన సామాజిక న్యాయం, ఫెడరలిజం, రాజ్యాంగ స్వతంత్ర సంస్థల పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గాదె హరిహరరావు, శీలం రవికుమార్, బక్కా జయరామిరెడ్డి, గోలి జేజిబాబు, కందుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మసాజ్ సెంటర్‌పై దాడి

ఒంగోలు టౌన్: నగరంలో ఒక మసాజ్ సెంటర్‌పై పోలీసులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని నెల్లూరు బస్టాండులో పాత ఎల్ఐసీ భవనం పక్క సందులోని ఒక కాంప్లెక్స్‌లో గల మసాజ్ సెంటర్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు శనివారం సాయంత్రం 6.30 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. దాంతో టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి స్పా సెంటర్‌పై ఆకస్మికంగా దాడి చేశారు. బాడీ మసాజ్ చేయించుకుంటున్న ఇద్దరు పురుషులను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న విద్యార్థినులు

చీరాల అర్బన్: పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర హైస్కూల్ 16వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నక్కల వెంకటరమణరావు, పి.రవికుమార్, పి.భానుచంద్రమూర్తి హాజరయ్యారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి రావాలని, మంచి విలువలు కలిగి జీవించాలన్నారు. క్రమశిక్షణ, నైతిక విలువలు కలిగి సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఆలయ పునరుద్ధరణకు రూ. 50,116 విరాళం


విరాళం అందిస్తున్న దాత రామారావు

చీరాల రూరల్: స్థానిక విఠల్‌నగర్‌లోని పాండురంగ స్వామి దేవాలయం పునరుద్ధరుణకు వాకర్స్ ఇంటర్నేషనల్ ఎస్ఆర్అండ్‌పీఎం చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాత సీనియర్ వాకర్స్ సభ్యుడు తన్నీరు రామారావు, దేవాలయం అధ్యక్షుడు చలంచర్ల శ్రీరామచంద్రమూర్తికి రూ. 50,116 విరాళం అందించి తన దాతృత్వాన్ని భక్తిని చాటుకున్నాడు. శనివారం స్థానిక ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడామైదానం ఈ సన్నివేశానికి వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ మాట్లాడారు. వాకర్స్ సభ్యులు నిరంతరం సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ హితానికి పాటుపడుతున్నట్లు చెప్పారు. విఠల్‌నగర్‌లోని పాండురంగ స్వామి దేవాలయం ఎంతో పురాతనమైనదని, పునరుద్ధరణలో భాగంగా ఆలయానికి కొత్తశోభ తీసుకురానున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీరామచంద్రమూర్తి చెప్పారు. ఆలయానికి సహకరించిన వాకర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాల వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

మద్దిపాడు: పాల వాహనం ఢీకొని యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కొలచనకోట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. మద్దిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొలచనకోటకు చెందిన శ్రావణ్ కుమార్ గ్రామంలోని రహదారి పక్కనున్న అతని తండ్రి టీ బంకు వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తూ రోడ్డు పక్కన నడుస్తుండగా, తాళ్లూరు వైపు నుంచి వెల్లంపల్లి వైపు వస్తున్న పాల వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రావణ్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించగా, పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.